చదువు
నైపుణ్య
ఈనాడు హైదరాబాద్ 10
గురువారం జనవరి 25, 2018 ■ e-mail: edc@eenadu.in

● విద్యార్థి నుంచి పారిశ్రామికవేత్తగా ● కొత్త పరిశోధనలు, పరిష్కారాలే పెట్టుబడి

ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థల్లో దాదాపు అన్నీ క్యాంపస్‌ల నుంచే ప్రస్థానాన్ని ప్రారంభించాయి. చదువుకుంటున్నప్పుడే ఉదయించే ఆలోచనలు అంకురాలు (స్టార్టప్‌లు)గా మారి మహావృక్షాలుగా విస్తరిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి ఎన్నో దిగ్గజ సంస్థలు ఇలాంటివే. కాలేజీల్లో చేసే ప్రాజెక్టుల నుంచి ప్రతి నిర్మాణాత్మక ఆలోచనను పెద్ద పెద్ద కంపెనీల ఏర్పాటుకు పునాదులుగా చేసుకోవచ్చు. అందుకే కళాశాలల నుంచే కార్పొరేట్ కంపెనీల ఏర్పాటు దిశగా విద్యార్థులు తమ ఆలోచనా పరిధిని పెంచుకోవాలి. ఆంత్రప్రన్యూర్‌లుగా అవతరించేందుకు తగిన మార్గాలను అన్వేషించాలి.

అంకురాధిపతి అవతారం!

వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు తమ చదువులు పూర్తయ్యేసరికి ఒక ఉద్యోగం సంపాదించుకోవాలని చూస్తారు. మరికొందరు ఉన్నత చదువులైన మాస్టర్స్, పీహెచ్‌డీ, పీడీఎఫ్ చేయడానికి సిద్ధమవుతుంటారు. ఈ మార్గాల్లో ప్రయాణించడానికి అవసరమైన సన్నద్ధతను కళాశాల క్యాంపస్ నుంచే ప్రారంభిస్తారు. ఇవేకాకుండా మరో మార్గం గురించి కూడా అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. అదే 'ఆంత్రప్రన్యూర్‌షిప్' లేదా స్వయం ఉపాధి. ఒక విద్యార్థి తన నాయకత్వ, వ్యాపార లక్షణాలను అంచనా వేసుకొని వాటిని సరైన మార్గంలో వినియోగించగలిగితే 'ఆంత్రప్రన్యూర్‌షిప్' అనేది ఒక మంచి జీవితానికి బాటలు వేస్తుంది. ఉద్యోగాల కోసం ప్రభుత్వం లేదా ఇతర కంపెనీలపై ఆధారపడకుండా తామే ఒక కంపెనీని ఏర్పాటు చేస్తే మరెంతో మందికి ఉపాధి కల్పించవచ్చు. ప్రపంచంలో నేడు దిగ్గజాలుగా వెలుగొందుతున్న కంపెనీల ప్రస్థానం కళాశాలల్లోనే మొదలైంది.

రవి కటుకం
ఇన్నోవేషన్ ఇవాంజిలిస్ట్

మన దేశంలోనూ..!

మన దేశంలో కూడా గత దశాబ్ద కాలంగా ఐఐటీ, ఎన్ఐటీలు ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి విద్యార్థులను స్వయం ఉపాధి వైపు నడిపిస్తున్నాయి. ఆంత్ర ప్రన్యూర్‌షిప్‌పై సదస్సులు నిర్వహిస్తున్నాయి. ఇంజినీరింగ్ మూడో, నాలుగో సంవత్సరం విద్యార్థులు లేదా మాస్టర్స్, పీహెచ్‌డీ అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో తమ మిత్రులతో, అధ్యాపకులతో బృందంగా ఏర్పడి అంకుర సంస్థలకు ప్రాణం పోయాలి.

Expertise
+
Technolog
+
Ideas
↓
Start up

ఆలోచనను రక్షించుకోవడం హక్కు

ఒక ఆలోచన స్టార్టప్‌గా మారగానే దాన్ని రక్షించుకోవడం అత్యంత ప్రధానం. ఒక ఐడియాను రక్షించుకోడానికి మేధోసంపత్తి హక్కులు వివిధ మార్గాలను సూచిస్తున్నాయి.

● పేటెంట్ ● ట్రేడ్‌మార్క్ ● డిజైన్ ● కాపీరైట్

విద్యార్థి దశలోనే మేధో సంపత్తి హక్కులపై అవగాహన కలిగి ఉంటే తమ పరిశోధన, ప్రాజెక్టులను వ్యాపార మార్గంలోకి మళ్లించవచ్చు. కొన్ని సందర్భాల్లో పెద్ద కంపెనీలు సైతం ఆసక్తికరమైన చిన్న ఆలోచనలను, వాటికి సంబంధించిన పేటెంట్ హక్కులను కొనుక్కుంటాయి. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఎన్నో ప్రాజెక్టులను డిజైన్ల రూపంలో భద్రపరచుకోవచ్చు. ఇలా రక్షించుకున్న ఆలోచనలను ఇంక్యుబేషన్ సెంటర్ల ద్వారా వ్యాపారాలుగా మలుచుకోవచ్చు. కొన్ని బహుళజాతి సంస్థలు ఓపెన్ ఇన్నోవేషన్ విధానంలో విద్యార్థుల నుంచి కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తున్నాయి.

▮ Air bus - Fly your ideas ▮ Innocentre.com ▮ Boeing - HorizonX ▮ TATA - TATA Innoverse ▮ Yetz.com ▮ Altair - Altair optimization contest ▮ Texas Instrument - Texas Instrument Innovation Challenge

ఈ ఓపెన్ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆయా కంపెనీల సమస్యల పరిష్కారంపై అవగాహన కలుగుతుంది. వీటిలో పాల్గొనడం వల్ల ఇన్నోవేషన్, ఆంత్రప్రన్యూర్‌షిప్‌లకు బీజం పడుతుంది. అందుకే సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రన్యూర్‌షిప్‌ల వైపు అడుగులు వేయాలి. దేశంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా ఉపాధికి, సంపద అభివృద్ధికి సోపానపడవచ్చు. విద్యార్థి స్థాయి నుంచే పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు మార్గాలను ఏర్పరచుకోవచ్చు.

కళాశాలలు చేయాల్సినవి

✦ ఆవిష్కరణ పోటీలు నిర్వహించడం ✦ కళాశాల యాజమాన్యం కావాల్సిన ఆదాయ వనరులు సమకూర్చడం

✦ విజయవంతమైన లేదా విఫలమైన వ్యాపారవేత్తల ఉపన్యాసాలు ✦ కళాశాలలో అంకుర సంస్థల అభివృద్ధి విభాగాల ఏర్పాటు ✦ విద్యార్థులకు వ్యాపార నిర్వహణ మీద నమూనా కంపెనీ (Mock company) పోటీలు నిర్వహించడం ✦ దేశీయ, అంతర్జాతీయ సంస్థల Accelerators మీద అవగాహన కలిగి ఉండటం ✦ తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల్లో వ్యాపారవేత్తల సమాచారం అందివ్వడం ✦ బహుళ జాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని విద్యార్థుల ఆలోచనలను మార్కెట్‌కి చేరవేయడం. ✦ ఆర్థిక నిర్వహణ మీద తగిన కోర్సులు ఏర్పాటు చేయడం.

ఇన్నోవేషన్ ఆంత్రప్రన్యూర్‌గా రాణించడానికి విద్యార్థులు పెంపొందించుకోవాల్సిన లక్షణాలు

◗ సమస్యలను గుర్తించడం (Problem identification) ◗ సమస్యలను నిర్వచించడం (Problem definition) ◗ సమస్యల పరిష్కారం (Problem solving) ◗ వ్యాపార దృక్పథం (Business acumen) ◗ నాయకత్వ లక్షణాలు (Leadership qualities) ◗ నమ్మకంగా ఉండటం. నమ్మకమైన స్నేహబృందాన్ని ఏర్పరచుకోవడం (Trusted Network) ◗ స్నేహం లేదా కలుపుగోలుగా ఉండే మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం ◗ ఆర్థిక అవగాహన కలిగి ఉండటం ◗ భవిష్యత్తు దృష్టి నైపుణ్యం (Visionary skill) ◗ విజయాలు సాధించిన పూర్వ విద్యార్థులతో మంచి సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం ◗ వ్యక్తీకరణ నైపుణ్యం (Presentation skill) ◗ అమ్మకాల నైపుణ్యం (Sales skill) ◗ ప్రపంచ పోకడలపై అధ్యయనం (Industry trend analysis) ◗ మార్గదర్శకులను ఎంచుకోవడం (Mentor selection) ◗ బృంద నిర్మాణం (Team building) ◗ పెట్టుబడులు రాబట్టడం (Funding attraction)

విజయవంతమైన ప్రతి కంపెనీ వెనుక ఏళ్ల తరబడి కృషి, పట్టుదల, మిత్రుల సహకారం ఉంటుంది. కళాశాల స్థాయి నుంచి మంచి బృందాన్ని నిర్మించుకోవడం నేర్చుకోవాలి.

క్యాంపస్ నుంచే ప్రఖ్యాత సంస్థల ప్రస్థానం

➤ మైఖేల్ డెల్ వెయ్యి డాలర్లతో కళాశాలలో ప్రారంభించిన డెల్ కంప్యూటర్స్ నేడు ప్రపంచ వ్యాప్తంగా ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను అందిస్తోంది. ఈ కంపెనీకి బీజం పడింది యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లోనే.

➤ నేడు మనమంతా మొబైల్స్‌లో విరివిగా వాడుతున్న డ్రాప్ బాక్స్ అనేది ఆరాష్ అండ్ డ్రూ అనే ఇద్దరు విద్యార్థులు మసాచ్యుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్నప్పుడు రూపొందించిందే.

➤ మార్క్ జుకర్ బర్గ్, డస్టిన్ మోస్కోవిజ్ తదితర మిత్రులు ప్రారంభించిన ఫేస్‌బుక్ నేడు ప్రపంచంలోని మిత్రులందరినీ ఏకం చేసే వేదికగా మారింది. జుకర్ బర్గ్ చిన్న ఆలోచనతో ఈ అంకురం హార్వర్డ్ యూనివర్సిటీలో పుట్టి గ్లోబ్‌ను ఆక్రమించింది.

➤ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ల్యారీపేజ్, సెర్జీబ్రిన్ అత్యున్నత సెర్చ్‌ఇంజిన్ కోసం డిజిటల్ లైబ్రరీ పేరుతో చేపట్టిన ప్రాజెక్ట్ గూగుల్ పేరుతో నేడు విశ్వ సమాచార శోధన యంత్రంగా మారింది.

➤ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేరొందిన బిల్ గేట్స్ మైక్రోసాఫ్ట్ మహావృక్షం ప్రాణం పోసుకుంది హార్వర్డ్ యూనివర్సిటీలోనే.

➤ పికాబు పేరుతో ప్రారంభమైన ఫొటో షేరింగ్ చాట్ నేడు స్నాప్ చాట్ పేరుతో రోజుకి 700 మిలియన్ల ఫొటోలను, వీడియోలను పంపించే ప్లాట్‌ఫాంగా మారింది. ఇవాన్ స్పీగల్ ప్రారంభించిన ఈ చాట్ అప్లికేషన్ ఫేస్‌బుక్, గూగుల్‌లాంటి కంపెనీల దృష్టిని ఆకర్షించి భారీ మార్కెట్ విలువను సంపాదించుకుంది. ఈ ప్రస్థానం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో మొదలైంది.

➤ బ్లాగింగ్‌కి అవసరమయ్యే వర్డ్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్ కూడా యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్‌లో ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రతి నెలా పదిహేను బిలియన్ల పేజీలను దీని ద్వారా వీక్షిస్తున్నారు.

➤ జెర్రీయాంగ్, డేవిడ్ ఫిలో అనే ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ప్రారంభించిన వెబ్ సైట్ యాహూగా మారి ప్రసిద్ధికెక్కింది.

ఎంబీఏకు మ్యాట్ మార్గం!

ఎంబీఏలో చేరదల్చినవారు రాసే జాతీయస్థాయి పరీక్షల్లో 'మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్' ఒకటి. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించే ఈ మ్యాట్ స్కోరు ద్వారా ప్రతిష్ఠాత్మక మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంబీఏ/ పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ఏటా నాలుగుసార్లు (ఫిబ్రవరి, మే, సెప్టెంబరు, డిసెంబరు) జరిగే ఈ పరీక్ష తాజా నోటిఫికేషన్ వెలువడింది.

ఫిబ్రవరిలోనే పరీక్ష ఉన్నందువల్ల ప్రస్తుతం ప్రాథమికాంశాలపై పట్టు సాధించేందుకు ప్రయత్నించవద్దు. ముందుగా అభ్యర్థులు పరీక్ష ఏ పద్ధతిలో రాయాలో నిర్ణయించుకోవాలి. అంటే ఈ పరీక్షను ఆటు ఆఫ్‌లైన్‌తోపాటు ఇటు ఆన్‌లైన్‌లోనూ ఫిబ్రవరి 2018లో నిర్వహించనున్నారు. ఆఫ్‌లైన్‌లో ఫిబ్రవరి 4న, ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 17 నుంచి నిర్వహించనున్నారు (తక్కువమంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే ఒకే రోజులో పూర్తవుతుంది, లేదంటే అభ్యర్థుల సంఖ్యనుబట్టి ఎన్ని రోజులు నిర్వహించాలో నిర్ణయిస్తారు).

పి. గోపాలకృష్ణ
డైరెక్టర్,
కెరియర్స్

ఆఫ్‌లైన్‌లో (పేపర్ బేస్‌డ్) అభ్యర్థి పరీక్ష రాయాలని నిర్ణయించుకుంటే ప్రస్తుతం 10 రోజుల వ్యవధి మాత్రమే అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లో పరీక్ష రాయాలనుకుంటే పరీక్షకు సుమారుగా 23 రోజులు అందుబాటులో ఉంటాయి. అంటే అభ్యర్థి ప్రస్తుతం సాధనపైనే పూర్తిస్థాయి దృష్టిసారించాలి. ప్రాథమికాంశాల అధ్యయనానికి వ్యవధి లేనందున పూర్తిస్థాయిలో మాక్ పరీక్షలను రాయాల్సి ఉంటుంది. అలాగే విధిగా సమాధానాలను పరిశీలించాలి. తరచూ తప్పులు చేస్తున్న అధ్యాయాలను గుర్తించి వాటిలోని అంశాలకు మరోసారి సిద్ధం కావాలి.

సమయపాలన ముఖ్యం

ఒక్క ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ మినహా మిగతావాటికి సమయపాలన చాలా కీలకం.

అందుబాటులో ఉన్న ఈ కొద్ది సమయంలో మేధమేటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీలపై దృష్టిసారించడం మేలు. ఈ అంశాలు రెండూ కలిపి 80 ప్రశ్నల వరకు వస్తున్నాయి. పైగా ఈ రెండు విభాగాలు అరిథ్‌మెటిక్ సన్నద్ధతపై ఆధారపడి ఉన్నాయి.

సరాసరి, శాతాలు, నిష్పత్తులు అనే మూడు అంశాలు, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ చాలా కీలకం. అన్వయంలోనే కొంచెం భిన్నంగా ఉంటుంది. సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలు చేయడం ద్వారా మంచి స్కోరు సాధించవచ్చు.

అయిదు అంశాల్లోనూ ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించి పెద్దగా సాధన చేయాల్సిన పనిలేదు. అయితే తాజా పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. జీఎస్‌టీ అమలు- క్రమం తప్పకుండా వస్తున్న మార్పులు, నోబెల్ బహుమతులు, ఉత్తరకొరియా అణు, క్షిపణి పరీక్షలు, ఇటీవలి కాలంలో అమెరికాలో వచ్చిన విధానపరమైన మార్పులు, భారత్, విదేశీ సంబంధాలు తదితర అంశాలను ఒకసారి పరిశీలించాలి.

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయి దినపత్రికల్లో వచ్చే సంపాదకీయాలను పరిశీలించాలి. రచయిత ఏం చెప్పాలనుకుంటున్నాడు, ఏ ఉద్దేశంతో ఫలానా అంశాన్ని రాశాడు.. ఇలా ప్రశ్నలు వేసుకుని సమాధానాలు రాబడితే పరీక్ష కోణం అలవడుతుంది. రీజనింగ్ అంశానికి సంబంధించి పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్ ప్రశ్నలు ప్రస్తుతం ఎక్కువగా సాధన చేయాలి. బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది. ఇది కూడా మంచి స్కోరింగ్ విభాగం. అందులో దీనికి ప్రాథమిక అంశాలు అంటూ ఉండవు.

పూర్తిస్థాయి మాక్ పరీక్షలు రాస్తే మంచి స్కోరు సాధించే అవకాశం అభ్యర్థులకు ఉంటుంది.

ప్రవేశాల తీరు ఎలా?

టాప్ బి-మేనేజ్‌మెంట్ కళాశాలలు, రెండు అంశాల ఆధారంగా అడ్మిషన్లు ఇస్తాయి. 1. అభ్యర్థి సాధించిన స్కోరు 2. పర్సంటైల్.

మొత్తం 200 ప్రశ్నలు ఉన్నా, 800 మార్కులకు స్కేలింగ్ ఇస్తారు. దీనిని కంపోజిట్ స్కోర్ విధానంగా చెబుతారు. దీని ఆధారంగా పర్సంటైల్‌ను నిర్ణయిస్తారు. దాదాపుగా దేశవ్యాప్తంగా 250 కళాశాలలు మ్యాట్ స్కోరును ప్రవేశాలకు పరిగణిస్తున్నాయి.

చివరి సంవత్సరం విద్యార్థులు కూడా...: మ్యాట్ రాయడానికి గ్రాడ్యుయేట్లు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా పరీక్ష రాయవచ్చు. వయసుతో నిమిత్తం లేదు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: జనవరి 26, 2018 ● పేపర్ ఆధారిత పరీక్ష: ఫిబ్రవరి 4, 2018 ● కంప్యూటర్ ఆధారిత పరీక్ష: ఫిబ్రవరి 17, 2018

● అడ్మిట్ కార్డులు అందుబాటులోకి వచ్చేది- ఫిబ్రవరి 27 నుంచి

అడ్మిషన్ల కోసం మ్యాట్ స్కోరును పరిగణలోకి తీసుకునే తెలుగు రాష్ట్రాల్లోని కళాశాలలు, ఇతర ప్రముఖ సంస్థల వివరాలను **www.eenadupratibha.net** లో

మ్యాట్‌లో మొత్తం 200 ప్రశ్నలుంటాయి. కేటాయించిన సమయం కేవలం 150 నిమిషాలు. ఈ పరీక్షలో ఉండే విభాగాలు:

విభాగం	ప్రశ్నలు	మార్కులు
లాంగ్వేజ్ కాంప్రహెన్షన్	40	40
మేధమేటికల్ స్కిల్స్	40	40
డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ	40	40
ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్	40	40
ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్	40	40

గత ఏడాది కొన్ని కళాశాలలు ప్రవేశాలు కల్పించిన కటాఫ్ పర్సంటైల్ స్కోరు

కళాశాల	పర్సంటైల్
బిమ్‌టెక్ (గ్రేటర్ నోయిడా)	70
ఎక్స్‌ఎంఈ (బెంగళూరు)	75
ఎంఎస్ రామయ్య (బెంగళూరు)	75
ఐఐఎంఎస్ (పుణె)	70
ఐఎంఎస్ (ఘజియాబాద్)	65

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

టీఎస్‌పీఎస్సీ

పోస్టు: ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 **ఖాళీలు:** 325 (పాతవి 200) (కొన్ని విభాగాల్లో 125 అదనపు పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ గడువు తేదీని పొడిగించింది) **అర్హత:** ఇంటర్మీడియట్‌తోపాటు డీఎంఎల్‌టీ లేదా బీఎస్సీ (ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ/ తెలంగాణ పారా మెడికల్ బోర్డుల్లో తప్పనిసరిగా రిజిస్టరై ఉండాలి. **వయసు:** 18 - 44 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ప్రభుత్వ సర్వీసుల్లో పనిచేసిన అనుభవం ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరితేది:** 10.02.2018 **వెబ్‌సైట్:** https://tspsc.gov.in/

పవర్ గ్రిడ్ కార్పొరేషన్

పోస్టు: అసిస్టెంట్ ఇంజినీర్ ట్రైనీ **ఖాళీలు:** 150 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో కనీసం 65శాతం మార్కులతో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్) ఉత్తీర్ణత. గేట్ - 2017 స్కోరు ఉండాలి. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 27.01.2018 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 17.02.2018 **వెబ్‌సైట్:** http://powergridindia.com/

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

పోస్టు: డిప్యూటీ ఇంజినీర్ **ఖాళీలు:** 27 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్/ ఏఎంఐఈ ఉత్తీర్ణత. మార్కెటింగ్ విభాగంలోని పోస్టులకు బీఈ/ బీటెక్/ ఏఎంఐఈతోపాటు ఎంబీఏ ఉండాలి. **వయసు:** 26 సంవత్సరాలకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 07.02.2018 **వెబ్‌సైట్:** www.bel-india.com/

రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ **ఖాళీలు:** 07 **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో కెమికల్ ఇంజినీరింగ్/ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కెమిస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత. హిందీ/ హిందీ ట్రాన్స్‌లేషన్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ ప్రధాన సబ్జెక్టుగా చదివి ఉండాలి. ప్రకటనలో పేర్కొన్న ఇతర అర్హతలు. **వయసు:** 31 సంవత్సరాలకు మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 19.02.2018 **వెబ్‌సైట్:** https://www.brbnmpl.co.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.